# 9

# దేవుని ఆలయం

"మీరు దేవుని ఆలయమై యున్నారనియు, దేవుని ఆత్మ మీలో నివసించు చున్నాడనియు మీరెరుగరా?" (1 కొరింథీ. 3:16).

దేవుడు లేని మానవ శూన్య స్థితిని ఆగస్టీన్ చూస్తూ, "దేవా, నీయందు విశ్రాంతి కనుగొనేవరకు మా హృదయాలు విశ్రాంతిలేక ఉంటాయ్" అని వ్రాశాడు. నరునితో సహవాసం చేయాలనే వాంఛతో దేవుని వైపునుండి చూస్తే, "ఓ మానవుడా, నాయందు నీవు విశ్రాంతి కనుగొనేవరకు, నా హృదయం నీకొరకు తపించుతుంది" అని నమ్మడం న్యాయంగానే ఉంటుంది.

సర్వశక్తుడు నిజంగా నరునితో సహవాసం చేయగోరుతున్నట్టు మనం నమ్మగలమా? అది ఆయన వాంఛ కానట్టయితే, విశ్వాన్ని, ఆకాశాలను, భూమిని, మరియు నరుని దేవుడైన యెహోవా ఎందుకు సృజించియుంటాడు? సర్వమునెరిగిన, సర్వజ్ఞుడైన దేవుడు నరుని, పిల్లలు పురాణ దేవతలను నమ్మినట్టు, తమ వినోదంకొరకు నరుని నిర్మించు కున్నాడని ఎవడు నమ్మగలడు? లోకం యొక్క నిర్మాణము, మరియు ఆత్మసంబంధమైన మానవ అంతర్గత శక్తి అనేవి కలిసి, ఆకాశములకును భూమికిని ప్రభువైయున్న దేవుడు మనిషితో సహవాసం చేయడంలో ఆనందిస్తాడని, వాదిస్తాయి.

తార్కిక జ్ఞానం ద్వారా మనం ఏ నిర్ణయానికి వస్తామో దానినే లేఖనాలు స్థాపి స్తున్నాయి. దేవుడు తన ప్రజలతో యిలా అన్నాడు, "-నేను వారిలో నివసించి సంచరింతును, నేను వారి దేవుడనై యుందును వారు నా ప్రజలైయుందురు" (2 కొరింథీ. 6:16). ఆయన ఎవరిని విమోచించి తన సహవాసానికి తెచ్చుకుంటాడో వారిని గూర్చి యిలా అన్నాడు, "నేను మిమ్మును చేర్చుకొందును, మీకు తండ్రినైయుందును, మీరు నాకు కుమారులును కుమార్తెలునై యుందురు ..." (2 కొరింథీ. 6:18).

దేవుడు తన ప్రజల మధ్య నివసిస్తాడనే ఈ సత్యం సంఘంతో మేళవించి చూడవలసి వస్తుంది. క్రొత్త నిబంధన క్రింద, సంఘము దేవుని ఆలయమై, ఆత్మీయ గృహమై (1 పేతురు 2:5), ప్రతి క్రైస్తవుడును ఆత్మసంబంధమైన యింటిలో సజీవమైన రాయియై (1 పేతురు 2:5), ఆ కట్టడమంతా ఆత్మయందు దేవుని నివాసస్థలంగా రూపొందుతోంది (ఎఫెసీ. 2:21, 22).

సంఘమును దేవుని ఆలయంగా గుర్తించడంలో, సంఘముయొక్క స్వభావంలోని మరొక స్వరూపం వ్యక్తమౌతుంది. పాత నిబంధన పరిధిలో "దేవాలయం" ఎంతో భావగర్భితమైయుండి, దేవునితో సంఘానికిగల బాంధవ్యాన్ని గూర్చియు, దేవునితో దాని నడకను గూర్చియు లోతైన గ్రహింపుకు మనలను తెస్తుంది.

అందువలన, క్రీస్తు సంఘమును గూర్చిన శ్రేష్ఠమైన గ్రహింపుకు "సంఘము దేవుని ఆలయం" ఎలాగైయుందో? అడుగుదాం.

## కలిసికొను చోటు

మొదటిగా, సంఘము దేవాలయం అనడంలో, సంఘము దైవ మానవులు కలిసికొనే చోటైయుంది. దేవుడూ మానవుడూ సహవాసమందు ఏకమయ్యేది సంఘంలోనే.

ఇశ్రాయేలు సీనాయి పర్వతము వద్దకు వచ్చినప్పుడు, మోషే ద్వారా ధర్మశాస్త్రమును, ఆరాధన స్థలాన్ని దేవుడు వారికిచ్చియున్నాడు. ఆరాధన స్థలం "కలిసికొను గుడారం" అని పిలువబడింది, ఎందుకంటే అది దేవుడైన యెహోవా మోషేతోను, తన యాజకుల తోను, తన జనులతోను కలిసికొన్న చోటు (నిర్గమ. 29:42). ఎడతెగని దహనబలులు ప్రత్యక్షగుడారము యొక్క ద్వారము వద్ద అర్పించబడుతూ ఉండేయి ఎందుకంటే దేవుడు యిలా తెలియజేశాడు, "... నీతో మాటలాడుటకు నేను అక్కడికి వచ్చి మిమ్మును కలిసికొందును. అక్కడికి వచ్చి ఇశ్రాయేలీయులను కలిసికొందును; అది నా మహిమవలన పరిశుద్ధపరచబడును" (నిర్గమ. 29:42, 43). సహవాసంలో తను తన ప్రజలు ఏ స్థలంలో కలిసికొనవలెనో దేవుడు నిర్మించుకున్నాడు.

ఇప్పుడు, క్రొత్త నిబంధన, క్రీస్తు యొక్క చివరి వీలునామా మరియు నిబంధన క్రింద తన ప్రజలతో దేవుడు కలిసికొనడానికి కోరుకున్న చోటు సంఘం. మనం క్రీస్తుయొక్క సువార్తకు లోబడినప్పుడు, క్రీస్తు రక్తమునందు మనం మన పాపములనుండి కడుగబడి, దత్త స్వీకారం ద్వారా దేవుని కుటుంబంలోనికి తేబడ్డాం (ఎఫెసీ. 1:5; గలతీ. 4:6). క్రైస్తవులుగా మారినవారు కేవలం దేవుని ఎరిగినవారు మాత్రమే అయ్యుండక, దేవునిచేత ఎరుగబడిన వారును, దేవుని స్వాస్థ్యములోనికి వచ్చినవారునై యున్నారు (ఎఫెసీ. 1:14; గలతీ. 4:9). మనం దేవుని కుమారులమయ్యాం, మరియు కుమారులుగా, క్రీస్తు ద్వారా జీవమునకు వారసులమయ్యాం (రోమా 8:17; గలతీ. 4:7). దేవుని కుటుంబమైన సంఘంలో మనం చేర్చబడ్డాం, అక్కడ దేవునితో సహవాసమందు నడుస్తాం, ప్రీతిగా ఆయనతో పాలుపొంపులు పొందుతాం.

సంవత్సరాల క్రిందట మార్షల్ కీబుల్ ప్రసంగంచేత సంఘం దీవించబడింది. ఆత్మసంబంధమైన సంగతులను కండ్లకు కట్టినట్టు చిత్రించే సామర్థ్యం ఉంది, దానితో శ్రోతలయొక్క ఆసక్తిని రాబట్టి, మనస్సుల్లోనికి సత్యాలను చొప్పిస్తుంటాడు. ఒక రాత్రి బాప్తిస్మం మీద అతడు ప్రసంగించుతూ, "దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది; అదేదనగా, శరీరమాలిన్యము తీసివేయుట కాదు గాని యేసుక్రీస్తు పునరుత్థాన మూలముగా దేవుని విషయము నిర్మలమైన మనస్సాక్షినిచ్చు ప్రత్యుత్తరమే" అని 1 పేతురు 3:21ని కోట్ చేశాడు. అప్పుడు సహోదరుడు కీబుల్ చెప్పిందేమంటే: "బాప్తిస్మం వద్ద ముగ్గురున్నారు. మొదటిగా, బాప్తిస్మం పొందేవాడు, పాపి, బాప్తిస్మం పొందడానికి హాజరయ్యాడు. రెండవదిగా, సువార్తికుడు, పాపికి బాప్తిస్మమిచ్చేవాడు, బాప్తిస్మమివ్వడానికి ఉన్నాడు. మూడవదిగా, దేవుడు హాజరయ్యాడు.

సువార్తికుడు పాపికి బాప్తిస్మమిచ్చేటప్పుడు, నీటియందు దేవుడును పాపియు కలిసికొంటారు."

మార్షల్ కీబుల్‌యొక్క ఉదాహరణ ఒక విశేషమైన పాయింటును చెప్పుతుంది. తన విమోచనా సంకల్పంలోని భాగంగా దేవుడు బాప్తిస్మాన్ని ఆజ్ఞాపించాడు. క్రీస్తులోనికి వచ్చుటలో మనం లోబడేది అది చివరి ఆజ్ఞ. విశ్వసించి, మారుమనస్సుపొంది క్రీస్తు లోనికి బాప్తిస్మం పొందిన పాపులు, రక్షింపబడే బాంధవ్యంలో నీటియందు దేవునితోను, క్రీస్తుతోను కలిసికొంటారు (రోమా 6:3; గలతీ. 4:6).

పవిత్రమైన సహవాసమందు ఆయన నరుని కలిసికొనే స్థలాన్ని ఏర్పాటు చేశాడనేది అద్భుతమైన సువార్త సందేశం, మరియు ఆ స్థలం సంఘమే. ఆయన వాక్యమందు, ఈ క్రైస్తవ యుగంలో దేవుడు నరునికిచ్చిన సందేశంలోని విశేషం, "నేను క్రీస్తు శరీరం, సంఘమనే నా దేవాలయంలో నిన్ను కలిసికొంటాను. ఆత్మసంబంధమైన జీవితానికి పరిశుద్ధ సహవాసంలోనికిని నీవు నన్ను కలిసికొనేలా రక్షణ మార్గాన్ని నేను నీకు ఏర్పరచాను."

## నివాస స్థలం

రెండవది, సంఘము దేవుని ఆలయం ఎందుకంటె అది దేవుని నివాస స్థలం. తన ఆలయంలో దేవుడు మనతో కలిసికొనడం మాత్రమే గాక, దానియందు ఆయన మనతో నివసిస్తాడు. సంఘం ద్వారా దేవుడు తన జనుల మధ్య నివాసం చేస్తాడు.

మోషే ధర్మశాస్త్రం క్రింద ప్రత్యక్షగుడారాన్ని గూర్చి దేవుడు ఇశ్రాయేలుతో యిలా చెప్పాడు, "నేను ఇశ్రాయేలీయుల మధ్య నివసించి వారికి దేవుడనై యుందును. కావున నేను వారి మధ్య నివసించునట్లు ఐగుప్తు దేశములోనుండి వారిని వెలుపలికి రప్పించిన తమ దేవుడైన యెహోవాను నేనే అని వారు తెలిసికొందురు. నేను వారి దేవుడనైన యెహోవాను" (నిర్గమ. 29:45, 46). ప్రత్యక్షగుడారము దానికి సంబంధించిన సమస్తము వారి మధ్య దేవునియొక్క ప్రసన్నతను ఇశ్రాయేలుకు గుర్తుచేస్తాయి. దేవుడు ఇశ్రాయేలుతో చేసిన వాగ్దానముననుసరించి, ఆయన ప్రత్యక్షగుడారాన్ని తన మహిమతో నింపాడు (నిర్గమ. 40:34). దేవుని ప్రసన్నత యొక్క ప్రత్యక్షతగా, ప్రత్యక్షగుడారముయొక్క అతి పరిశుద్ధ స్థలం ప్రక్కన పగలు మేఘ స్తంభముగాను రాత్రి అగ్ని స్తంభముగాను నిలిచింది. ఇశ్రాయేలు పగలు ప్రయాణం సాగించినప్పుడు, దేవుని నడిపింపును సూచించడానికి మేఘస్తంభము, రాత్రులందు అగ్ని స్తంభము వారి ముందర నడిచింది (నిర్గమ. 40:36–38; సంఖ్యా. 9:15–23). ప్రత్యక్షగుడారము ద్వారా, వారిని నడిపించుచు దేవుడు తన జనుల మధ్య నివసించాడు.

క్రొత్త నిబంధనలో సంఘము ఆత్మ ద్వారా దేవునికి నివాస స్థలమైయుంది. కొరింథీలోని సంఘానికి పౌలు యిలా వ్రాశాడు, "దేవుని ఆలయమునకు విగ్రహములతో ఏమిపొందిక? మనము జీవముగల దేవుని ఆలయమై యున్నాము; అందుకు దేవుడీలాగు సెలవిచ్చుచున్నాడు – నేను వారిలో నివసించి సంచరింతును, నేను వారి దేవుడనై

యుందును వారు నా ప్రజలైయుందురు" (2 కొరింథీ. 6:16). ఎఫెసీ. 2లో క్రైస్తవులుగా మారిన అన్యజనులను గూర్చి పౌలు యిలా అన్నాడు,

> కాబట్టి మీరికమీదట పరజనులును పరదేశులునైయుండక, పరిశుద్ధులతో ఏక పట్టణస్థులును దేవుని యింటివారునై యున్నారు. క్రీస్తు యేసే ముఖ్యమైన మూలరాయియై యుండగా అపొస్తలులును ప్రవక్తలును వేసిన పునాదిమీద మీరు కట్టబడియున్నారు. ప్రతి కట్టడమును ఆయనలో చక్కగా అమర్చబడి, ప్రభువునందు పరిశుద్ధమైన దేవాలయమగుటకు వృద్ధిపొందుచున్నది. ఆయనలో మీరు కూడ ఆత్మ మూలముగా దేవునికి నివాసస్థలమై యుండుటకు కట్టబడుచున్నారు (ఎఫెసీ. 2:19-22).

దేవుడు క్రైస్తవులలో రెండు విధాలుగా నివసిస్తాడు: మొదటిది, ఆయన ఆత్మ వ్యక్తిగతమైన ప్రతి క్రైస్తవునిలో, క్రైస్తవుని హృదయం ఆయన దేవాలయంగా ఉపయోగించుకొని నివసిస్తాడు. క్రైస్తవులు తమ దేహాలను అపవిత్రతనుండి శుభ్రంగా ఉంచుకోవాలని వివరిస్తూ ఆత్మ క్రైస్తవులలో నివసిస్తాడనే ఉద్దేశాన్ని పౌలు ఉపయోగించాడు: "జారత్వమునకు దూరముగా పారిపోవుడి ... మీ దేహము దేవునివలన మీకు అనుగ్రహింపబడి, మీలోనున్న పరిశుద్ధాత్మకు ఆలయమై యున్నదని మీరెరుగరా? మీరు మీ సొత్తు కారు, విలువపెట్టి కొనబడినవారు గనుక మీ దేహముతో దేవుని మహిమపరచుడి" (1 కొరింథీ. 6:18, 19).

రెండవది, సంఘమనే, క్రైస్తవుల ఏకమైన దేహమందు దేవుని ఆత్మ నివసిస్తాడు. కొరింథీ సంఘాన్ని గూర్చి పౌలు యిలా వ్రాశాడు, "మీరు దేవుని ఆలయమై యున్నారనియు, దేవుని ఆత్మ మీలో నివసించుచున్నాడనియు మీరెరుగరా?" (1 కొరింథీ. 3:16). "మీరు" అనే ఈ పదం గ్రీకులో పౌలు బహు వచనంలోనే ఉపయోగించాడు. సంఘమనే, విశ్వాసుల సముదాయాన్ని స్పష్టంగా ఆత్మ మనస్సులో ఉంచుకొనినట్టున్నాడు, కేవలం ఒక క్రైస్తవుని మాత్రం కాదు.

---

సంఘము దేవుని ఆలయంగా, దేవుడు కలిసికొనే చోటు,
దేవుడు నివసించే చోటు మనం దేవుని ఆరాధించే చోటు.

---

దేవుడు తన ప్రజలయందు ఎలా నివసిస్తాడనే విషయాన్ని గూర్చి మనందరికి ప్రశ్నలుండవచ్చు. ఏదియెలాగున్నా, మనం నిశ్చయత కలిగియుండగల ఒక సత్యమేమంటే, దేవుడు తన వాక్యం ద్వారా క్రియ జరిగిస్తాడు గనుక, ఆయన అంతరంగంలో నివసించేది ఆయన వాక్య ప్రకారం జరుగుతుంది (ఎఫెసీ. 6:17). ఈ లేఖన భాగాలలో, అంతరంగంలో దేవుడు నివసించే విధానాన్ని పౌలు వివరించలేదు, అతడు కేవలం దాన్ని స్థాపించాడు. ఈ లేఖనాలలో క్రైస్తవులు కనుగొనవలసిన సత్యమేమంటే, దేవుడు మనతో వ్యక్తిగతంగాను, సామూహికంగాను నివసిస్తాడు. ఆయన మన మధ్య నివసిస్తాడు; ఆయన మనలో ఉంటాడు.

ఎనభై ఏండ్ల ప్రాయంలో, హోరేబు వద్ద మండుతున్న పొద దగ్గర, దేవుడు మోషేను కలిసికొన్నాడు (నిర్గమ. 3:1). ఆయన అతనితో యిలా అన్నాడు "... నిన్ను ఫరోయొద్దకు పంపెదను; ఇశ్రాయేలీయులైన నా ప్రజలను నీవు ఐగుప్తులోనుండి తోడుకొని పోవలెను" (నిర్గమ. 3:10). దేవునికొరకు ఐగుప్తుకు పోవలసినవాడు తానేయని మోషే నమ్మలేదు. అయితే దేవుడు అతని సాకులన్నిటికి ఉత్తరమిచ్చిన తరువాత, మోషే మండుచున్న ఆ పొదనుండి సాగిపోయి, బాధింపబడుచుండిన ఇశ్రాయేలీయులను విడిపించాలనే పనికొరకు ఐగుప్తుకు వెళ్లాడు. దేవునితో కలిసికొనడానికిని దేవునితో నడవడానికిని గల వ్యాత్యాసాన్ని మోషే త్వరలోనే కనుగొన్నాడు. హోరేబు విడిచి, అతడు దేవునితో నడిచిపోయాడు. "నిశ్చయముగా నేను నీకు తోడైయుందు"నని దేవుడు మోషేకు తెలియ జేశాడు (నిర్గమ. 3:12). దేవుడు తన వాగ్దానాన్ని నిలుపుకొని, తెగుళ్లలోనుండి, ఎర్ర సముద్రములోగుండ, సీనాయి పర్వతంనొద్దకు మోషే ఇశ్రాయేలును నడిపించేటప్పుడు, ఆయన అతనితో కూడ ఉన్నాడు.

దేవుని ఆలయమైన సంఘముగా, క్రీస్తునందు మనం దేవునితో కలిసికొనడం మాత్రమే గాక, ఆయన మనలో ఎల్లప్పుడు నివసించుతూ, మనతో నడుస్తాడు. క్రైస్తవులు ఎంత ధైర్యంతోను అభయంతోను ఉండాలో! క్రైస్తవ జీవితాన్ని మనం నమ్మకంగా జీవిస్తు న్నట్టయితే, దేవునితో మనం దైనిక సహవాసమందు నడుస్తాం. శుభప్రదమైన ఆయన సహవాసము, బలము లేకుండ, ఒక శోధనను గాని, ఒక కష్టాన్ని గాని ఎదుర్కోలేం.

యోహాను యిలా వ్రాశాడు, "ఆయనతో కూడ సహవాసముగలవారమని చెప్పుకొని చీకటిలో నడచినయెడల, మనమబద్ధమాడుచు సత్యమును జరిగింపకుందుము. అయితే ఆయన వెలుగులోనున్న ప్రకారము మనమును వెలుగులో నడిచినయెడల, మనము అన్యోన్యసహవాసము గలవారమై యుందుము; అప్పుడు ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపమునుండి మనలను పవిత్రులనుగా చేయును" (1 యోహాను 1:6, 7).

## ఆరాధించు చోటు

మూడవది, సంఘము దేవుని ఆలయముగా, ఆరాధనా చోటైయుంది. క్రైస్తవుడు నడిచే కెథడ్రల్ అయ్యున్నాడు.

పేతురు యిలా అన్నాడు, "యేసుక్రీస్తుద్వారా దేవునికి అనుకూలమగు ఆత్మ సంబంధమైన బలులనర్పించుటకు పరిశుద్ధ యాజకులుగా ఉండునట్లు, మీరును సజీవమైన రాళ్లవలెనుండి ఆత్మసంబంధమైన మందిరముగా కట్టబడుచున్నారు" (1 పేతురు 2:5). ఇంకను అతడిలా అన్నాడు, "అయితే మీరు చీకటిలోనుండి ఆశ్చర్యకరమైన తన వెలుగులోనికి మిమ్మును పిలిచినవాని గుణాతిశయములను ప్రచురముచేయు నిమిత్తము, ఏర్పరచబడిన వంశమును, రాజులైన యాజకసమూహమును, పరిశుద్ధ జనమును, దేవుని సొత్తయిన ప్రజలునై యున్నారు" (1 పేతురు 2:9). నేటి దేవుని యాజకులుగా, నేడు క్రైస్తవులు క్రీస్తుయేసు ద్వారా ఏ సమయంలోనైనా, ఏ స్థలంలోనైనా దేవునికి స్తుతులు చెల్లింపవచ్చు. ప్రభువైన యేసునుబట్టి, ధైర్యంగా దేవుని సమీపింపవచ్చునని

హెబ్రీ రచయిత అర్థించాడు: “గనుక మనము కనికరింపబడి సమయోచితమైన సహాయముకొరకు కృప పొందునట్లు ధైర్యముతో కృపాసనమునొద్దకు చేరుదము” (హెబ్రీ. 4:16).

ఆరాధన అనేది ఒక నిర్ణీతమైన స్థలానికి పరిమితి చేయబడింది కాదని, అంటే, దైవికంగా ఏర్పాటు చేయబడిన పర్వతానికో లేక కట్టడానికో అది పరిమితం కాదని ప్రభువైన యేసు అన్నాడు, “–అమ్మా, ఒక కాలము వచ్చుచున్నది; ఆ కాలమందు ఈ పర్వతము మీదనైనను యెరూషలేములోనైనను మీరు తండ్రిని ఆరాధింపరు. నా మాట నమ్ముము” (యోహాను 4:21). భవిష్యత్తులో ఆరాధన అంగీకరింపబడేది ఆత్మతోను సత్యముతోను చేసినందుకే గాని, సరియైన భౌతిక స్థలంలో చేసినందుకు కాదని ఆయన చెప్పుతున్నాడు. ఆ సమరయ స్త్రీతో ఆయన యింకా యిలా తెలిపాడు, “అయితే యథార్థముగా ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను తండ్రిని ఆరాధించు కాలము వచ్చుచున్నది; అది ఇప్పుడును వచ్చేయున్నది; తన్ను ఆరాధించువారు అట్టివారే కావలెనని తండ్రి కోరుచున్నాడు” (యోహాను 4:23). ప్రభువైన యేసు క్రైస్తవ యుగాన్ని గూర్చి మాట్లాడుతున్నాడు. క్రైస్తవులు, దేవుని యాజకులుగా, ఆయనద్వారా ఎప్పుడైనా ఎక్కడైనా దేవుని ఆరాధిస్తారు.

దేవుని చెంతకేగే సంపూర్ణమైన అవకాశం, ఆరాధించే అధికృత (యోహాను 4:23), పాపములకు శాంతికరమైన ఏర్పాట్లు (1 యోహాను 2:1), మరియు దైవికమైన శక్తి (ఎఫెసీ. 1:19) కలిగినవారై క్రైస్తవులు ఆశీర్వదింపబడ్డారు. దేవుని యాజకులుగా, అత్యధికమైన కృపను పొందియుండినందున, “ఆయనద్వారా మనము దేవునికి ఎల్లప్పుడును స్తుతియాగము చేయుదము, అనగా ఆయన నామమును ఒప్పుకొనుచు, జిహ్వాఫలము అర్పించుదము” (హెబ్రీ. 13:15).

## ముగింపు

సంఘము దేవుని ఆలయమైయుంది! ఎంతటి సవాలు చేయు సత్యము! దేవుని ఆలయంగా, సంఘము, దేవుని కలిసికొనే చోటు, దేవుని నివాస స్థలము, మరియు మన ఆరాధనా స్థలమైయుంది.

నీవు క్రీస్తు సంఘ సభ్యుడవా? నీవు క్రీస్తుకు వెలుపల ఉన్నట్టయితే ఎంత పోగొట్టుకుంటున్నావో ఆలోచించు. ఆయనకు వెలుపల, దేవుడు నరునితో కలిసికొనే చోటుకు వెలుపల ఉన్నావు. నీవు ఎంత మతస్థుడవుగా ఉన్నా, నీవు నిజంగా దేవుని కలిసికోలేదు లేక ఆయన చెంతకు రాలేదు. ఆయనకు వెలుపల నీవు దేవుని అంగీకారంగా ఆరాధించలేవు. ఆయన నియమించిన మార్గంలో, నీవు ఉన్న చోటునుండి ఆయనను ఆరాధించ లేవు. ఆయనను ఆరాధించడానికి సూచింపబడిన చోటు, క్రైస్తవుని హృదయం. క్రీస్తు శరీరానికి వెలుపల నీవు ఉన్నట్టయితే, దేవునితో ఈ జీవితంలోను నిత్యత్వంలోను నడవడానికి గాను ఆయన శరీరంలోనికి ప్రవేశింప తీర్మానించుకో (రోమా 6:3).

దేవుని ప్రసన్నతను, ఆయన దయచేసినవాటిని అనుభవించడానికి, దేవుడు

ఏర్పరచుకొన్న స్థలంలో నీవు ఉండాలి. మోషే ఐగుప్తుకు వెళ్లి జనులను విడిపించాలనేది దేవుని ఉద్దేశమైయుంది. మోషే వేరొక దిక్కునకు వెళ్లియుంటే ఏమైయుండేది? దేవుని ప్రసన్నత, ఏర్పాట్లు, (provisions), మరియు దేవుని శక్తి లేకుండాపోయి ఉండేవాడే. అది నిజమై ఉంటుంది ఎందుకంటే, అతడు ఉద్దేశానికి వెలుపట నిలిచియుండేవాడే. యోనాను నీనెవె వెళ్లుమని దేవుడు ఆజ్ఞాపించాడు. కాని యోనా తర్షీషుకు బయలుదేరాడు. బైబిలు యిలా అంది, "... యోనా యొప్పేకు పోయి తర్షీషునకుపోవు ఒక ఓడను చూచి, ప్రయాణమునకు కేవు ఇచ్చి, **యెహోవా సన్నిధిలో నిలువక** ఓడవారితోకూడి తర్షీషుకు పోవుటకు ఓడ ఎక్కెను" (యోనా 1:3; ఎంఫసిస్ నాది). దేవుని సహవాస బంధంతో యోనా నీనెవెకు వెళ్లియుండేవాడే, కాని తర్షీషు పట్టణానికి కాదు. దేవుని ఉద్దేశస్థలము నీనెవె; తర్షీషు కాదు.

దేవుని ఆలయమైన సంఘములోనికి వచ్చే ఎవడైనా, దేవుని సంకల్పంలోనికిని, "నేను మీకు తండ్రినైయుందును, మీరు నాకు కుమారులును కుమార్తెలునై యుందురు" (2 కొరింథీ. 6:18) అని దేవుడు ఎవరిని గూర్చి అన్నాడో ఆ శరీరంలోనికి వస్తాడు. ఒకడు క్రైస్తవుడుగా మారినప్పుడు, వాని మంటి ఘటము, వాని శరీరము దేవుని యొక్క మహిమాయుక్తమైన ఆలయమౌతుంది!

## స్టడీ మరియు చర్చకొరకైన ప్రశ్నలు

1. "దేవా, నీయందు విశ్రాంతి కనుగొనేవరకు మా హృదయాలు విశ్రాంతిలేక ఉంటాయ్" అని ఆగస్టీన్ అన్నాడు. ఆ ప్రతిపాదనకు అర్థమేమి?
2. దేవుడు మనతో సహవాసం చేయ గోరుతున్నట్టు మనకున్న రుజువేమి? ఇది నిజమని నమ్మడానికి కారణాలను పేర్కొను.
3. దేవుడు మన సహవాసాన్ని కోరుతున్నట్టు బోధించే లేఖనాలను పేర్కొను.
4. సంఘం దేవుడు, నరుడు "కలిసికొనే చోటు" ఎలాగైయుంటుంది?
5. పాత నిబంధన కాలంలో దేవుడూ, నరుడూ ఎలా సహవాసం కలిగి యుండేవారు?
6. క్రైస్తవ యుగంలో, సంఘము ఎలా దేవుని "నివాస స్థల"మయ్యిందో చర్చించు.
7. ప్రత్యక్షగుడారము దేవుని నివాస స్థలంగా ఇశ్రాయేలునకు ఎలా జ్ఞాపకం చేసింది?
8 క్రైస్తవులలో దేవుడు నివసించే రెండు విధానాలను చర్చించు (1 కొరింథీ. 6:18, 19; 3:16).
9. క్రీస్తు సంఘము "ఆరాధన స్థలం" ఎలాగయ్యింది?
10. నిజమైన ఆరాధనకు సంబంధించి భౌతికమైన స్థలాన్ని గూర్చి చర్చించు.
11. సంఘము దేవుని ఆలయమైయున్నందున, పాత నిబంధన చట్టం క్రింద ఉన్నవారు అనుభవించిన దీవెనలకు భిన్నంగా మనం అనుభవించే దీవెనలను పేర్కొను.
12. దేవుని ఆలయంలో మనం ఎలా ప్రవేశిస్తాం?